

# ఎవరు పైల్వాను?

ఒకూర్లో ఒక పైల్వాన్ వున్నాడు. వాడో పెద్ద ఎచ్చులుపుడింగి.

'నా కంటే పెద్ద పైల్వాను ఈ చుట్టుపక్కల ఎవడూ లేడు' అని చెప్పుకుంటూ, తొడలు కొడుతూ తిరుగుతుండేవాడు.

ఆ దారిన పోతూ, వీడి ఎచ్చులు చూసిన ఒక పెద్దాయన 'అబ్బాయ్. నువ్వే కాదు పైల్వాన్‌వి. నీ కంటే పెద్ద పైల్వాను ఫలానా ఊర్లో ఉన్నాడు. కావాలంటే చూసుకోపో' అని ఒక చురకేసి పోయాడు.

అది విని పైల్వాన్‌కు కోపం వచ్చేసింది.

'ఐట్. అట్లెట్ల ఉంటాడు? వాణ్ణి చంపేస్తాన్ నరికేస్తాన్ మింగేస్తాన్' అని బయులుదేరాడు.

అక్కడకు వెళ్లేసరికి ఆ పైల్వాను యింట్లో లేడు. వాడి చెల్లెలు మాత్రం ఒక ఏనుగుని చంపి, దానిని చీపిరి కట్ట మీద వేసుకొని, పేడదిబ్బ మీద పారేయడానికి వెళుతూ ఎదురొచ్చింది. యింతలో ఆమె అన్న నలభై శేర్ల పలావు దేక్షాని చిటికెన వేలి గోరు మీద పెట్టుకొని ఆ బరువు వెంట్రుకతో సమానంగా మోస్తూ యింటికొచ్చాడు.

వీళ్లిద్దరినీ చూసేసరికి ఈ పైల్వానుకి పైప్రాణాలు పైన్నే పోయాయి.

అయినాసరే 'ఎట్లాగూ రానే వచ్చాము చస్తే చస్తాము' అని 'ఒరే పైల్వాన్‌గా. ఈ చుట్టుపక్కల యిలాఖాలో నువ్వు నన్ను మించిన పైల్వాన్ అని అందరూ అంటా ఉన్నారు. అదేగనక నిజమైతే నాతో పోటీకి రా' అని కుస్తీకి పిలిచాడు.

'అలాగే పా' అని ఆ పైల్వాను ఒప్పుకున్నాడు.

ఇద్దరూ కలిసి అడవిలో చేరి కుమ్ములో దుమ్ముగా కుస్తీ ఆడారు. కానీ ఎంతసేపటికీ ఎవరు గెలిచారో తేలడంలా.

అప్పుడే అటువైపుగా, నడుం వంగిపోయిన ఒక పండు ముసలామె సద్ది మూట కట్టుకొని పోతా ఉంది.

పైల్వాన్లిద్దరూ ఆమె వెంటపడ్డారు.

'అవా అవా. మేమిద్దరం పైల్వాన్లమి. మేము కుస్తీ ఆడుతాము. ఎవరు గెలిచారో నువ్వు చెప్పాలి' అన్నారు.

అప్పుడా ముసలామె 'నాయనలారా. యిట్లాంటి వాటికి యిప్పుడు నాకాడ టైము లేదు. నా మనవడు చిన్న తప్పు చేశాడని పొద్దున



మందలించాను. అందుకు వాడు అలిగి యింటికి రాకుండా పరగడుపుతో ఒంటెల్ని కాయడానికి అడవిలోకి పోయాడు. వాడికి సద్ది తినిపిస్తేనే నా కడుపు చల్లబడేది. మీకు అంత తొందరగా వుంటే చెరొకరు నా భుజాల మీద కూర్చోని కుస్తీ ఆడండి. నా మనవణ్ణి చేరే లోపల ఎవరు గెలిచారో చెబుతాను' అంది.

ఆ మాటలతో ఈ పైల్వాన్లిద్దరికీ మాట పోయింది.

'ఓరి నాయనో. యీమె మనకంటే పెద్ద పైల్వాను లాగుందే' అనుకొని చెరో భుజాన ఎక్కారు. వాళ్లు కుస్తీ ఆడుతుంటే ఆ ముసలామె పైట చెంగుతో సమానంగా వాళ్లను మోస్తూ ముందుకు నడుస్తా వుంది.

ఆమెనీ, ఆమె భుజాల మీద వున్న పైల్వాన్లనీ చూసి ఒంటెలు కాస్తున్న మనవడు దూరం నుంచే దడుచుకున్నాడు.

'అమ్మబాబోయ్ తిట్టింది చాలక నన్ను కొట్టించడానికి మా అవ్వ పైల్వాన్లని వెంటబెట్టుకొని వస్తా వుంది' అనుకొని, వాడు మేపుతున్న పన్నెండు వందల ఒంటెల్ని ఆదరాబాదరా మూటగట్టి నెత్తిన బెట్టుకొని పరుగు మొదలెట్టాడు.

వాడు అట్లా పరిగెడతా పరిగెడతా వుంటే ఒక గద్దొచ్చి వాడి నెత్తి మీదున్న మూటను తన్నుకుపోయింది. అది పోతూ పోతూ ఒకచోట దానిని జారవిడిచింది.

సరిగ్గా అదే సమయానికి ఆ దేశపు రాజుగారి కూతురు వాళ్ల మేడ మీదెక్కి జుట్టు ఆరబోసుకుంటూ వుంది. ఆమె కళ్లెత్తి పైకి చూసేసరికి ఈ మూటొచ్చి ఆమె కుడి కంట్లో పడింది. కన్ను చురుక్కుమంది.

'కంట్లో నలక పడింది. కంట్లో నలక పడింది' అంది రాజుగారి కూతురు.

అప్పుడు చెలికత్తె వచ్చి, కంట్లోకి చూసి, 'ఆహా. నయాపైసా ఖర్చులేకుండా పన్నెండు వందల ఒంటెలు దొరికే మార్గం కనిపించింది' అని సంబరపడి 'ఏమీ లేదు షహజాదీ గారూ. ఏదో నలక' అని నాలిక చివరతో ఆ నలకను తీసి, నేరుగా యింటికి వెళ్లి ఆ పన్నెండు వందల ఒంటెల్నీ దొడ్లో కట్టేసుకుంది.

ఆ రాత్రి ఆ చెలికత్తె కూతురికి పాస్ వచ్చింది.

వాళ్లమ్మను లేపి 'అమా అమా. ఒంటేలు' అంది.

వాళ్లమ్మ నిద్రలో 'దక్షిణం వైపు పోయబాక. ఉత్తరం వైపు పోసుకో' అంది.

అయినాగానీ ఆ పెడద్రపు కూతురు వినకుండా దక్షిణం వైపునే పాస్ పోసింది.

ఆ ధారకి ఆవైపు దొడ్లో వున్న ఒంటెలన్నీ కొట్టుకుపోవడం మొదలుపెట్టాయి. అవి మునుగుతూ తేలుతూ కుయ్యోమొర్రో అని గుడ్లు తేలేస్తూ ఉంటే ఆ దోవన పోతున్న ఒకాయన 'అరెరె ఏంటిది? ఒంటెలన్నీ చచ్చేట్టున్నాయే' అనుకొని, కంటిరెప్పలోని ఒక వెంట్రుకను పీకి ప్రవాహానికి అడ్డం వేశాడు.

దెబ్బతో ప్రవాహం ఆగి ఆ ఒంటెలన్నీ బతుకు జీవుడా అని బయటపడ్డాయి.

యీ కథ యింకా ఉందిగానీ యిప్పటివరకూ లెక్కతేలిన పైల్వాన్లలో అందరికంటే పెద్ద పైల్వాను ఎవరు?

అది తేలితేనే తర్వాతి కథ. లేకుంటే లేదు.

✪ ఈ కతను నెల్లూరు వెంకటేశ్వర పాలెంలో ఒక పదేళ్ల పాప చెప్పింది. ఈ కతను చెప్పాక కతను విన్న వాళ్లంతా ఒక్కొక్కరు ఒక్కో ఫైల్వాన్ పక్షం తీసుకుంటారు. నా పైల్వాన్ గొప్ప అంటే నా ఫైల్వాన్ గొప్ప అనుకుంటారు. అదో ఆట.